మసీద్‌బండలో బొడ్రాయి ప్రతిష్ఠ


బొడ్రాయి ప్రతిష్ఠలో రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీద్‌బండ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ భూమిపూజ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్, కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. బొడ్రాయి ప్రతిష్ఠ అనంతరం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని గ్రామస్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సదానంద్‌యాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

సాయిబాబానగర్‌లో చలివేంద్రం ప్రారంభం

జీడిమెట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. జీడిమెట్ల సాయిబాబానగర్ చౌరస్తాలో విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అదే విధంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కడికి విచ్చేసిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు జి.సత్తిబాబు, జె.తాతాజీ, సిహెచ్.నాగరాజు, ఏ.నరసింహ, చిన్న, పి.నాగరాజు, గంగాధర్, హనుమంతు, ప్రభాకర్, తులసి, మౌనిక, విజయలక్ష్మి, నమ్రత, సత్యాదేవి, కృష్ణఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదు

దుండిగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ, ప్రభుత్వంపై విమర్శలు చెయ్యడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి దుండిగల్ చిన్న దామెర చెరువును కబ్జా చేసి భవనాలు నిర్మిస్తే హైకోర్టు ఆదేశాల ప్రకారం కూల్చివేతలు చేశామని, ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్య మంత్రికి ఆపాదించడం సబబు కాదన్నారు. శుక్రవారం నర్సారెడ్డి భూపతిరెడ్డి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులతో కలిసి దూలపల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే 13 వందల ఎకరాల మేరకు ప్రభుత్వ భూములు కబ్జా చేసి సుమారు రూ.25 వేల కోట్లను దోచుకున్న చరిత్ర బీఆర్ఎస్ నాయకులదేనని దుయ్యబట్టారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ రవీందర్‌రెడ్డితో ఇందిరానగర్ నూతన కమిటీ సభ్యులు

కార్పొరేటర్‌ను కలిసిన ఇందిరానగర్ నూతన కమిటీ

బాలానగర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి ఇందిరానగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిప్రసాద్, జనరల్ సెక్రటరీ అర్జున్, కోశాధికారి రాజు కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన కమిటీ సభ్యులను సత్కరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీలో అక్రమాలకు తావివ్వకుండా బస్తీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.


కాంతారావుతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

బాలానగర్, మార్చి8(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించి మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. శుక్రవారం బాలానగర్ ఫిరోజ్‌గూడలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్త రూప ఏర్పాటు చేసిన సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం బీజేపీ ప్రభుత్వ పథకాలతో కూడిన క్యాలెండర్, పుస్తకాలు, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జీఆర్.రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సిరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు శివరంజని, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కేక్‌కట్ చేస్తున్న సినీనటి కుషిత కల్లపు

మహిళలు దృఢంగా ఉండాలి: సినీనటి కుషిత

గచ్చిబౌలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు దృఢంగా ఉంటేనే సమాజం కూడా దృఢంగా ఉంటుందని సినీనటి కుషిత కల్లపు తెలిపారు. కొండాపూర్ అపోలో క్రెడిల్‌లో స్ట్రాంగ్ ఉమెన్ స్ట్రాంగ్ భారత్ థీమ్తో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల పట్ల ఎంత శ్రద్ధ వహిస్తారో.. అంతే శ్రద్ధ తమ పట్ల వహించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. క్రమంతప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. అనంతరం అపోలో క్రెడిల్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుధా మాధురి మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉండటం చాలా కీలకమన్నారు.

డాక్టర్ రెడ్డీస్ ఉద్యోగి అదృశ్యం


సతీష్

దుండిగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్లిన డాక్టర్ రెడ్డీస్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. దుండిగల్ ప్రాంతంలోని గండిమైసమ్మ మేఘన రెసిడెన్సీలో నివాసముంటున్న గట్టిమి సతీష్(36), సత్యగౌరి భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సతీష్ బాచుపల్లిలోని డాక్టర్ రెడ్డీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 6వతేదీ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. భార్య సాయంత్రం ఫోన్‌చేసినా సమాధానం ఇవ్వక పోవడంతో అతడి స్నేహితులకు ఫోన్ చేయగా సతీష్ విధులకు హాజరుకాలేదని చెప్పారు. దీంతో సత్యగౌరి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కూకట్‌పల్లి వెంకటేశ్వరనగర్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


మహాశివునికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్రనాయకులు కూన శ్రీశైలంగౌడ్


హైదర్‌నగర్ హెచ్ఎంటీ హిల్స్ రామాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు


నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ తేజశ్రీ దంపతులు

శివోహం..

- శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు
- వేకువజాము నుంచే ఆలయాలకు బారులు తీరిన భక్తులు


శివరాత్రి సందర్భంగా జగద్గిరిగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్.ఎస్.మల్లారెడ్డి, నాయకులు


కుత్బుల్లాపూర్‌లోని శివాలయంలో పూజల్లో మేయర్ కొలన్ నీలారెడ్డి

(కుత్బుల్లాపూర్/ కూకట్‌పల్లి/ శేరిలింగంపల్లి, జోన్‌బృందం)

కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని పలు శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. శివరాత్రి సందర్భంగా దేవాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పలు డివిజన్ల పరిధిలో శివరాత్రి శోభ సంతరించుకున్నది. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు మహిళలు, భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు. కూకట్‌పల్లి ప్రాంతంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆల్విన్ కాలనీ ఫేస్-2లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు.
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.
- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రశాంత్‌నగర్‌లోని ప్రత్యేక పూజలు చేశారు.
- గచ్చిబౌలి టెలికంనగర్ సాయిదత్త గణపతి ఆలయంలో ఉదయం కాగడ హారతి, వినాయక, దత్తాత్రేయ, సాయిబాబా వారికి అభిషేకం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


సూరారం ఉమామహేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మదన్‌గౌడ్ ఎమ్మెల్యేకు షీల్డ్ అందజేశాడు.


చందానగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన పూజల్లో భక్తులు


పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రవికుమార్‌యాదవ్, తదితరులు


గాజులరామారం దేవేందర్‌నగర్ శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న కాలనీవాసులు


టెలికాంనగర్ సాయిదత్త గణపతి ఆలయంలో..


ఫతేనగర్ శివాలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్ బీఆర్ఎస్ నేతలు


శాతవాహనకాలనీ ఉమామహేశ్వర ఆలయంలో భక్తులు


గాజులరామారం శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామ్‌రెడ్డి తదితరులు


శివరాత్రి పూజల్లో బీజేపీ బీసీ రాష్ట్ర నాయకులు శేఖర్‌యాదవ్


కూకట్‌పల్లి గ్రామంలోని పాత శివాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ నాయకులు

మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని, అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గడిస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మూసాపేట డివిజన్ మోతీనగర్‌లో 'అవంతి నగర్ మహిళా మండలి' ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారావు మాట్లాడుతూ.. మహిళలు తమ పిల్లలకు ఉత్తమ ఆలోచనా విధానాన్ని బోధించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సి.సత్యనారాయణ, బీఆర్ఎస్ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, వెంకటేశ్వరరావు, తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.


మూసాపేటలో జరిగిన వేడుకల్లో జెడ్సీ అభిలాష అభినవ్, మహిళా ఉద్యోగులు, కార్మికులు

● అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కూకట్‌పల్లి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలంటూ సమాజంలో అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ అందిపుచ్చుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రంగాల్లో మహిళలకు అపార అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సందర్భంగా కార్మికులు కేక్‌కట్ చేశాయించారు. కార్యక్రమంలో ఉమాదేవి, హేమ, శ్రీకాంత్ రెడ్డి, డా.సాల్మన్‌రాజు, రూపాదేవి పాల్గొన్నారు.

● ఏఐఎఫ్‌డీడబ్ల్యూ ఆధ్వర్యంలో..

మియాపూర్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ కమిటీ (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) ఆధ్వర్యంలో విమెన్స్ డే వేడుకలు మియాపూర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి.భాగ్యమ్మ, సంఘం రాష్ట్ర కోశాధికారి తాండ్ర కళావతి, పుష్ప, లలిత, ఈశ్వరమ్మ, అఫ్సర్‌బేగం, జయలక్ష్మి, అరుణ, సుల్తానాబేగం, రజియాబేగం, అమీనాబేగం, శ్రీలత, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

● చీరల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ: మహిళా దినోత్సవం పురస్కరించుకొని ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1లో టీడీపీ సీనియర్ నాయకులు అట్లూరి దీపక్‌చౌదరి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ దండమూడి సామ్రాజ్యం జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్కే చౌదరి, చెరుకూరి రవి, యశ్వంత్, ఘంటా హేమంత్, అనిల్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

● ఇంద్రాహిల్స్ కాలనీలో..

హైదర్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆల్విన్‌కాలనీ శంషిగూడ పరిధిలోని ఇంద్రాహిల్స్ కాలనీలోని స్నేహ మోడల్ స్కూల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్, ఆయన సతీమణి సౌజన్య హాజరై మహిళలతో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.


జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ సామ్రాజ్యం తదితరులు

తండ్రిని హత్య చేసిన కొడుకు అరెస్ట్, రిమాండ్

వనస్థలిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తనపేరుపై భూమి రిజిస్ట్రేషన్ చేస్తలేదని కోపం పెంచుకున్న కొడుకు తన తండ్రిని చంపి, ఆత్మహత్య చేసుకున్నాడని కట్టుకథ అల్లిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వై.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం సాహెబ్‌నగర్ వెంకటేశ్వర కాలనీకి చెందిన రుద్రపల్లి శేఖర్(42) తండ్రి రుద్రపల్లి మైసయ్య గత నెల 16న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా మైసయ్యది ఆత్మహత్య కాదు, లుంగితో గొంతు పిసికి చంపారని వైద్యులు పోస్టుమార్టం రిపోర్టులో తెలిపారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ మృతుని కొడుకు శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తన పేరిట 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కొద్దినెలలుగా తన తండ్రి మైసయ్యను శేఖర్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన మైసయ్య ప్రతిరోజు మద్యం తాగి దూషించడంతో కాలనీలో తనని అవమానపరుస్తున్నారని శేఖర్ తన తండ్రిపై కోపం పెంచుకున్నాడు. దీంతో శేఖర్ గత నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో లుంగితో తన తండ్రి గొంతు పిసికి చంపివేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా తన తండ్రి మైసయ్య తన ఇంట్లోనే లుంగితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించినట్లు శేఖర్ పోలీసుల ముందు నిజం ఒప్పుకున్నారు. ఈ మేరకు పోలీసులు శేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చెత్తకు నిప్పు.. ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు


కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను కాల్చడంతో అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలంటుకుని అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మలక్‌పేట లాలాజర్ హోటల్ ఎదుట శుక్రవారం చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ పోలీసులు, విద్యుత్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట లాలాజర్ హోటల్ ఎదుట రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటి చుట్టుపక్కన స్థానికులు వేసిన చెత్తకుప్పను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. చెత్త నుంచి మంటలు ఎగిసిపడి అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అంటుకోవడంతో ఒక్కమారుగా మంటలు ఉవ్వెత్తున లేచాయి. మంటలు గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. హుటాహుటిన అగ్నిప్రమాపక దళాన్ని రప్పించి మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం అగ్నిప్రమాదానికి కారణాలను ఆరాతీయగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్థానికులు వేసిన చెత్తను కాల్చడం వల్లే ప్రమాదం జరిగినట్లు చాదర్‌ఘాట్ విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు గుర్తించారు. అగ్నిప్రమాదానికి కారకులను గుర్తించేందుకు చాదర్‌ఘాట్ పోలీసులు చర్యలు చేపట్టారు. రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వాటి కేబుళ్లు పూర్తిగా కాలిపోయాయని అధికారులు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్టేషన్ పరిధిలోని గండిచెరువు గ్రామానికి చెందిన ఎం.లక్ష్మమ్మ(70) బుధవారం సాయంత్రం 4గంటలకు వైద్య పరీక్షల కోసం పెద్దఅంబర్‌పేట్‌కు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం లక్ష్మమ్మ మనువడు వంశీ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ బహిరంగసభను విజయవంతం చేయాలి

కూకట్‌పల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో శనివారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కోరారు. ఈ మేరకు సభ ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశంలో బండి రమేష్ పాల్గొన్నారు. కండ్లకోయ ఐటీ పార్కు శంకుస్థాపన, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థాయి బహిరంగసభల్లో సీఎం, మంత్రులు పాల్గొంటారని రమేష్ వివరించారు. నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

- **నిజాంపేట్:** మేడ్చల్ జిల్లా కండ్లకొయ్యలో ఐటీ పార్కు శంకుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్న ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజన నాయకులు, మైనార్టీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పిలుపునిచ్చారు.
- **బాలానగర్:** శనివారం సాయంత్రం 4 గంటలకు కొంపల్లి - కండ్లకోయలో జరిగే కాంగ్రెస్ మహాసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ నియోజకవర్గ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కండ్లకోయ ఐటీ పార్కు ప్రారంభోత్సవ అనంతరం మల్కాజిగిరి పార్లమెంటు స్థాయి భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు.